క్లుప్తంగా

ముగిసిన క్రీడోత్సవాలు



విజేతలతో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, హెచ్‌ఎంలు

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న మండలస్థాయి క్రీడోత్సవాలు శనివారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గందె రాధిక హాజరై మాట్లాడారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. హెచ్‌ఎంలు శోభారాణి, వీడెపు శ్రీనివాస్, చిరంజీవి, ఈశ్వర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ సొల్లు సారయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుత శ్రీనివాస్, పీఈటీలున్నారు.

జమ్మికుంట: పట్టణంలోని బాలుర పాఠశాల మైదానంలో ఈనెల 8 నుంచి 10 వరకు మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మంథన హేమలత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8న బాలికల అండర్-14, 17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, 9న బాలుర అండర్-14, 17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, 10న అథ్లెటిక్స్ అండర్-14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు పోటీలుంటాయన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

గంగాధర: వెంకటాయిపల్లి గ్రామంలో శనివారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ హర్షిత్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన



చిగురుమామిడి: మండలంలోని 3 గ్రామాల్లో కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం అభివృద్ధి పనులను పరిశీలించారు. ముదిమానిక్యం, రామంచ, చిన్నముల్కనూర్ గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను నాయకులు పరిశీలించారు. హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, గ్రామాల అధ్యక్షులు ఎండీ కుతుబుద్దీన్, వంటకాల సంపత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొడిగె పర్శరాములు, బోయిని వేణుగోపాల్, పచ్చిమట్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్‌కు నివాళి

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంఈ‌ఈ గ్రూపు వొకేషనల్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న సారం జేమ్స్ 2 రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నివాళి అర్పించారు. కళాశాలలో 30 సంవత్సరాలుగా క్రమశిక్షణతో విద్యార్థులకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు



ఇల్లందకుంట: మండల కేంద్రంలోని పలు వీధుల్లో దీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జమ్మికుంట-ఇల్లందకుంట ప్రధాన రహదారి వెంట వీధి దీపాల్లేక చీకట్లు కమ్ముకున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురవడంతో విష పురుగుల సంచారం అధికంగా ఉంటుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రేపు రాజకీయ పార్టీల సమావేశం

రామడుగు: ఎంపీడీవో సమావేశ హాల్‌లో రాజకీయ పార్టీల సమావేశాన్ని ఈనెల 8న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితా ప్రచురణపై చర్చ ఉంటుందన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే తగ్గింపు

కరీంనగర్‌టౌన్: పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యుడు బొంతల కళ్యాణ్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ప్రజలందరూ ఉపయోగించుకునే 80 శాతం వస్తువులపై టాక్స్ తగ్గింపు ఇదే మొదటి సారి అని అన్నారు. నిత్యావసర వస్తువులకు 5 శాతం, సాధారణ వస్తువులకు 18 శాతం, విలాసవంతమైన, హానికరమైన వస్తువులకు 40 శాతంతో జీఎస్టీలో మార్పులు చేయడం మంచి పరిణామమని అన్నారు.

ఎన్నాళ్లీ వేతన వెతలు..?

- 35 ప్రభుత్వ పాఠశాలల్లో 2,168 మంది విద్యార్థులు
- 2008 నుంచి గ్యాస్ సిలిండర్లు లేక కట్టెల పొయ్యిపైనే వంట చేస్తున్న కార్మికులు
- 4 నెలల నుంచి విడుదల కాని కమీషన్, వేతనాలు
- చాలీచాలని కమీషన్‌తో అవస్థలు



చిన్నముల్కనూర్‌లో రేకుల షెడ్డు కిందే వంట

చిగురుమామిడి: మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 35 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ప్రాథమిక పాఠశాలలు 20, ప్రాథమికోన్నత పాఠశాలలు 4, జెడ్పీ పాఠశాలలు 9, ఒక ఆదర్శ పాఠశాల, ఒక కేజీబీవీల్లో 2,168 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

2008లో ప్రారంభం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన హయాంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు గాను మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. స్వశక్తి సంఘాల్లోని మహిళలు వంట చేసి పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి నేటి వరకు 17 సంవత్సరాలుగా మహిళలు చాలీచాలని వేతనంతో కాలం వెల్లదీస్తూ విద్యార్థులకు వంట చేసి పెడుతున్నారు.

17 ఏళ్లుగా..

ప్రభుత్వ పాఠశాలల్లో 17 సంవత్సరాల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు కట్టెల పొయ్యి మీదే వంట చేస్తున్నారు. వంట గదులు సరిగా ఉండవు. రేకుల షెడ్లలోనే మహిళలు వంట చేస్తున్నారు. వర్షాకాలంలోనైతే చాలా ఇబ్బంది పడుతుంటారు. వేసవిలో గాలిదుమారానికి అన్నం, కూరలు సరిగా ఉడకవు. దీంతో మహిళలు అవస్థలు పడుతుండగా.. కొందరు మహిళలకైతే కట్టెల పొగ వల్ల కళ్లు కనిపించని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఈ వంట చేయక ముందు వారిలో చాలామందికి కంటి అద్దాల్లేవు. ప్రస్తుతం కంటి అద్దాలతో వంట చేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించాక కూడా గత ప్రభుత్వం కట్టెల పొయ్యిల స్థానంలో సిలిండర్లను సరఫరా చేయకపోవడం విడ్డూరమని పలువురు కార్మికులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం కట్టెల కొనుగోలుకు కూడా ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరలు పెరిగినా..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేయాలంటే ప్రతిరోజు నిత్యావసర సరుకులు, కూరగాయలు కొనుగోలు చేయాల్సిందే. కాని వాటి ధరలు ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉన్నా.. విద్యార్థుల పేరున చెల్లించే కమీషన్ డబ్బులు పెరగకపోవడంతో వారు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఒక నూనె ప్యాకెట్ ధర రూ.155, కిలో పెసర పప్పు రూ.120, కిలో కంది పప్పు రూ.75, కిలో టమాటా ధర రూ.50 ఇలా చెప్పుకుంటూ పోతే ధరలకు అంతే లేకుండా పోతోంది. ఇలా ధరలు పైపైకి పోవడంతో.. వచ్చే కమీషన్‌తో చేసిన అప్పులు తీర్చలేక కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు.

పెరగని కమీషన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చే కమీషన్‌ను 2 సంవత్సరాల నుంచి పెంచకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మెనూ ప్రకారం కార్మికులు విద్యార్థులకు సరైన భోజనం పెడుతున్నా.. మారుతున్న కాలానికనుగుణంగా కమీషన్ పెంచకపోవడంతో వారు ఆర్థిక తిప్పలనెదుర్కొంటున్నారు. ప్రభుత్వం 1-5వతరగతి విద్యార్థులకు భోజనం పెట్టినందుకు రూ.6.78 చొప్పున చెల్లిస్తుండగా, 6-10వతరగతి చదివే విద్యార్థులకు రూ.10.17 మాత్రమే చెల్లిస్తోంది. కనీసం రోజువారీ కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని కార్మికులు వాపోతున్నారు.

ఎదురుచూపులు..

4 నెలల నుంచి మధ్యాహ్న భోజన బిల్లులు, తమకిచ్చే కమీషన్లు రాక కార్మికులు అవస్థలు పడుతున్నారు. నెల వచ్చేసరికి ఇచ్చే కొద్దిపాటి కమీషన్ చేతికందితే అప్పులకు పోను ఏమైనా మిగిలితే తమ కుటుంబ అవసరాలు తీరుతాయని ఆశించిన కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిరాశే ఎదురువుతోంది.

58 మంది..

మండలంలోని 17 గ్రామాల్లో 35 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 58 మంది మహిళా కార్మికులు వంట చేస్తున్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.వెయ్యి, రాష్ట్ర ప్రభుత్వం రూ.2వేల కనీస వేతనాలను అందిస్తున్నాయి. 4 నెలలుగా ఈ కొద్దిపాటి వేతనాలు కూడా వారికందడం లేదు.

విడుదల కాని కమీషన్

ప్రభుత్వ జెడ్పీ పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థుల వంట చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా చెల్లించలేదు. ఇప్పటివరకు రూ.1.45లక్షలు వంట కార్మికులకు రావాల్సి ఉంది. నెలనెలా ఇచ్చే గౌరవ వేతనం కింద రూ.1.32లక్షలు రావాలి.

రాగానే చెల్లిస్తాం



2 నెలలకు సంబంధించిన మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు వచ్చాయి. ట్రెజరీకి పంపాం. వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతాయి. మిగిలిన బిల్లులు ప్రభుత్వం నుంచి రాగానే చెల్లిస్తాం.
– వి.పావని, ఎంఈవో, చిగురుమామిడి

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



జమ్మికుంట: ప్రశంసాపత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు

జమ్మికుంట: ఎంఈవో హేమలత అధ్యక్షతన మండలస్థాయిలో పది మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి శనివారం సన్మానం కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి సత్కరించారు. జి.సుధాకర్, అంజనీప్రసాద్, బి.స్వప్న, డి.రవీందర్, పి.ప్రణీత, బి.సారంగం, జి.రజిత, రమేశ్, ఆచార్యమాధవి, జి.శ్రీనివాస్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు.

కొత్తపల్లిలో సాహితి ఫౌండేషన్ ట్రస్ట్ సౌజన్యంతో గార్డియన్ ప్రైవేటు స్కూల్‌లో పేద విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తున్న ప్రిన్సిపాల్ మహమ్మద్ అంకుష్‌కు కరీంనగర్‌లో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు చేతుల మీదుగా శనివారం మెమెంటో అందజేసి సత్కరించారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న వి.నరేందర్‌రెడ్డి

రామడుగు: గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో 10వతరగతి చదువుతున్న తాటిపర్తి హర్షవర్ధన్ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించాడు. విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. తమిళనాడులోని నామకల్ జిల్లాలో నిర్వహించిన పోటీల్లో పతకం సాధించాడన్నారు. ఉపాధ్యాయులు అభినందించారు.

ఓటరు జాబితా ప్రదర్శన



ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో

గంగాధర: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని మండల ప్రాదేశిక స్థానాలకు సంబంధించిన ఓటరు జాబితాను శనివారం ఎంపీడీవో ధమ్మని రాము ప్రదర్శించారు. మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలుండగా.. సంబంధిత నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితాను పొందుపరిచినట్లు, ఏమైనా అభ్యంతరాలుంటే 3 రోజుల్లో తెలియజేయాలన్నారు. ఎంపీవో గౌరి రమేశ్, సూపరింటెండెంట్ జీవన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కిరణ్, టైపిస్టు సంతోష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలో 37,867 ఓటర్లున్నట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. 13 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాను శనివారం ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. 19,217 మహిళలు, 18,650 మంది పురుష ఓటర్లున్నారు.

వినాయకుడికి పూజలు



తిర్మలాపూర్‌లో పూజలు చేసిన సుంకె రవిశంకర్

రామడుగు: తిర్మలాపూర్ గ్రామంలో శనివారం వినాయకుడికి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పూజలు చేశారు. నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మండపంలో అగ్ని ప్రమాదం

వీణవంక: చల్లూరు గ్రామంలో బొంగోని మణికంఠ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి శోభాయాత్ర చేసి నిమజ్జనం పూర్తి చేసిన తర్వాత అందరూ తమ ఇళ్లలోకి వెళ్లారు. మండపంలో ఉన్న డీజే బాక్సులు, డబ్బులు, పూజ సామగ్రితోపాటు ఇతర వస్తువులు శనివారం ఉదయం వెళ్లి చూసేసరికి కాలి బూడిదయ్యాయని మణికంఠ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

యూరియా పక్కదారి

- తీసుకున్నవారే మళ్లీ వరుసలో..
- ఆధార్‌తో పంపిణీ చేయడమే కారణం
- రైతుకు ఎన్ని ఎకరాలుందనే విషయం పరిశీలించని అధికారులు
- బ్లాక్‌లో బస్తా రూ.700కు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు



చిగురుమామిడిలో రైతుల బారులు(ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో పంపిణీ చేస్తున్న యూరియా బస్తాలు ప్రైవేటు వ్యాపారుల వద్దకు పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నెల రోజులుగా చిగురుమామిడి, ఇందుర్తి, రేకొండ, నవాబుపేట్ గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో పంపిణీ చేయగా.. సుందరగిరి, బొమ్మనపల్లిల్లో ప్రైవేటు డీలర్లు యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. ఎవరు రైతులు, ఎవరు కూలీలు అని పంపిణీ నిర్వాహకులు పరిశీలించకపోవడంతో.. బస్తాలు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఒక్క ఆధార్ కార్డు ఉంటే చాలు.. బస్తాలు దొరుకుతాయనే ఆలోచనతో కొందరు భూములు లేని రైతులు పదేపదే బస్తాలు తీసుకునేందుకు వరుసలో నిలబడుతున్నారు. వారికి భూమి ఎంత ఉంది, ఇప్పటి వరకు ఎన్ని బస్తాలు తీసుకున్నారు అనే విషయాలను వ్యవసాయ శాఖ అధికారులు, సింగిల్‌విండో సిబ్బంది పరిశీలన చేయకపోవడంతో.. నిజమైన రైతులకు అందడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. బస్తాలను పంపిణీ చేసిన ప్రతిసారి వారి పేర్లు, ఆధార్ నంబర్, భూముల వివరాలు నమోదు చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఐదు నుంచి పదెకరాలు, ఆపై వరి, మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేసిన రైతులకు బస్తాలు అందకపోవడంతో వారు నానా యాతన పడుతున్నారు.

టోకెన్ ఇస్తున్న ఏఈవోలు

ఆయా గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో పంపిణీ చేసిన యూరియా బస్తాలకు ఏఈవోలు రైతులకు టోకెన్లు జారీ చేశారు. టోకెన్లు జారీ చేసిన రైతులకు మాత్రమే ఒకటి లేదా రెండేసి బస్తాలను పంపిణీ చేశారు. ఒకసారి తీసుకున్న రైతులు మరోసారి వరుసలో ఉంటున్నారు. అలాంటి వారికి వ్యవసాయ భూమి ఉందా, ఉంటే ఎన్ని ఎకరాలుంది, ఇప్పటివరకు ఎన్ని బస్తాలు తీసుకున్నారు, లెక్కకు మించి తీసుకుంటే మిగతా రైతుల పరిస్థితి ఏమిటి, ఒకటికి నాలుగుసార్లు వరుసలో ఉండి బస్తాలు తీసుకుంటే అవి ఎటు పోతున్నాయి అనే అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించకపోవడంతో.. యూరియా కొరత తీవ్రమైందని పలువురు రైతులు, మేధావులు చర్చించుకుంటున్నారు. ప్రైవేటు ఫర్టిలైజర్ షాపు యజమానులు తమ వద్ద ఎరువులు కొనుగోలు చేసిన వారికి మాత్రమే పంపిణీ చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అక్కడ వారే తీసుకుంటూ, ఇక్కడ వారే తీసుకుంటూ లెక్కకు మించి బస్తాలను తమ ఇళ్లలో దాచుకోవడంతో.. అసలే యూరియా దొరకని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బ్లాక్‌లో అమ్మకం

రూ.280 నుంచి రూ.300 వరకు ఒక యూరియా బస్తాను కొనుగోలు చేసిన రైతులు కాని కొందరు అధిక ధరకు విక్రయిస్తున్నారనే వాదనలు బలంగా వినవస్తున్నాయి. పేరు చెప్పడానికి ఇష్టపడని కొందరు రైతులు తమకు ఫలానా వ్యక్తి వద్ద ఉన్న ఒక బస్తా రూ.700కు ఇస్తానంటున్నాడని వాపోయారు.



రామడుగు: కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై వెదిర శివారులోని శ్రీదత్తాత్రేయస్వామి ఆలయం సమీపంలో గుంతతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పలువురు ప్రమాదాల బారిన పడ్డారని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు తక్షణం పూడ్చాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సాయికృషి, ఏఈ, ఆర్‌అండ్‌బీ, సెల్ నంబర్: 9008479686

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



రామడుగు: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



గన్నేరువరం: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

రామడుగు: రామడుగులో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని సులభతరం చేస్తూ పేద, రైతు, మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగేలా నిర్ణయాలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. నాయకులు పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్, ఎడవెల్లి రామ్, కట్ట రవీందర్, మాడిశెట్టి జయంత్, లక్ష్మణ్, సంటి జితేందర్, రాజేందర్, అంజిబాబు పాల్గొన్నారు.

గన్నేరువరం: మైలారం గ్రామ 197, 198 బూతుల్లో విలాసాగరం రాయమల్లు, కొంకటి రవీందర్ ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ అధ్యక్షుడు నగునూరి శంకర్, విరగోని వెంకటేశ్, బుర్ర శ్రీను, బొమ్మ మహేశ్, రంగనవేని కుమార్, గువ్వ ఆంజనేయులు, బుర్ర చంద్రశేఖర్, దొగ్గల జగన్ తదితరులు పాల్గొన్నారు.



లడ్డూ దక్కించుకున్న రాజును సన్మానిస్తున్న సభ్యులు



లడ్డూతో పర్శరాములు దంపతులు

గణపతి లడ్డూ కైవసం

హుజూరాబాద్‌రూరల్: పోతిరెడ్డిపేట గ్రామంలోని బీసీకాలనీలో సోషల్ వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడి మండపంలో గణపతి లడ్డూను బొల్లవేని రాజు రూ.36,116కు దక్కించుకున్నాడు.

చిగురుమామిడి: రామంచ గ్రామంలో భజరంగ్ సేన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో తుంగ మౌనిక-పర్శరాములు దంపతులు రూ.14,116కు గణపతి లడ్డూను దక్కించుకున్నారు.

గన్నేరువరం: మైలారం గ్రామ శ్రీమల్లికార్జునస్వామి ఆలయం వద్ద గణనాథుడి లడ్డూకు వేలం నిర్వహించగా.. కరీంనగర్‌కు చెందిన చౌదపూడి దుకాణ యజమాని కేసీ సంతోష్‌కుమార్-రవళి రూ.10,516కు దక్కించుకున్నారు.



లడ్డూతో కేసీ సంతోష్‌కుమార్-రవళి

వైభవంగా గణనాథుని నిమజ్జనం



మానకొండూర్ రూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వెల్ది గ్రామంలో గడీమహల్ యూత్ ఆధ్వర్యంలో గడీ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన శోభాయాత్ర వైభవంగా జరిగింది. డప్పు చప్పుళ్లు, మహిళల కోలాటాలు, చిన్నారుల నృత్యాల మధ్య గడీ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర మానేరు వాగు వరకు సాగింది. వాగులో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు నగునూరి ప్రవీణ్, ఎనగంటి కృష్ణ, వెల్ది శ్రీకాంత్, పర్శరాం పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి



గన్నేరువరం: చొక్కారావుపల్లె నుంచి కరీంనగర్ వైపు వెళ్లే దారిలో చొక్కారావుపల్లె గ్రామంలోని లోలెవల్ కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద కల్వర్టుపై నుంచి ప్రవహించడంతో కల్వర్టు పక్కన మట్టి కొట్టుకుపోయి గండి ఏర్పడింది. ఈ కల్వర్టుకు ఉండే సిమెంట్ గద్దెలను ఇసుక వ్యాపారులు గతంలో తొలగించారు. ఇక్కడే మలుపు ఉండడంతో వాహనాలు అదుపు తప్పితే నేరుగా ఈ గుంతలోకి దూసుకెళ్లే ప్రమాదముందని ప్రయాణికులంటున్నారు.

నియామకం

విద్యానగర్(కరీంనగర్): జాతీయ మాల మహానాడు కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా ఇరుకుల్ల యాదగిరి, చొప్పదండి అసెంబ్లీ ఇన్‌చార్జిగా కునుమల్ల చంద్రయ్య, మానకొండూర్‌కు లింగంకుమార్, హుజూరాబాద్‌కు జూపాల శ్రీనివాస్‌లను శనివారం జిల్లా అధ్యక్షుడు కాడే శంకర్ నియమించారు.